


# సర్పశిల

## - భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

### *(కొనసాగింపు వచ్చే నెలలో)*

హైదరాబాద్

"నాయనగారూ.. ఏదో దొరికినట్లు దొరుకుతోంది. కానీ దొరికింది సరైనది కాదు. ఏదో జరగబోతోందనే వ్యాకులత. "విహ్వలంగా అన్నాడు ఎస్.పి వాసుదేవ్. ఎదురుగా తల్లి సౌభాగ్యలక్ష్మి, తండ్రి పుండరీకాక్షుడు వున్నారు. అచ్యుత నారాయణ కొంచెం ఎడంగా వుండి బండి తుడుస్తున్నాడు.

అచ్యుత్‌కి జీప్ తుడవడం ఓ అలవాటు.

"నాయనా.. మనసు ఒక రిసీవర్, ఒక ట్రాన్స్ మీటర్, ఒక ఎడ్వైజర్, ఒక ఎనలైజర్, ఈ నాలుగు పనులూ అద్భుతంగా చేస్తుంది. మనసు వ్యాకులపడుతోందంటే అర్థం, అది తీవ్రంగా ఆలోచిస్తున్నదని. ఇది నేను సరదాగా చెప్పడం లేదు. సంకల్పించడం అనేది భావతరంగాలని నిర్దుష్టస్థానానికి పంపడంలాంటిది. అంటే, ఆలోచనలను సరైన కక్ష్యలో

పెడితేనే అవి సరైన సమాచారం మనకి ఇవ్వగలవు. ఒక్కోసారి సంకల్పం అతి బలహీనమవుతుంది. కారణం వ్యాకులత్వం. వ్యాకులత్వం అనేది ఎటువంటిదంటే పొగమంచులాంటిది. ఆ పొగమంచు దట్టంగా కమ్మినప్పుడు ఏదీ కనబడదు. కొంచెం ఓపిక పట్టు. కొంచెం నీ మనసుని రిలాక్స్ అవనీ. నీకు తెలియనంత వేగంతో నువ్వనుకున్నది సాధించగలవు" అన్నారు పుండరీకాక్షుడుగారు.

"అబ్బాయ్.. అల్లం పచ్చిమిర్చి దంచి, నువ్వు పప్పు కలిపి, లేలేత వంకాయలతో గుత్తొంకాయ తయారు చేశాను. బ్రహ్మాండమైన పెరుగు పచ్చడి సిద్దంగా వుంది. అదీ, పొట్లకాయ పెరుగు పచ్చడి. ఇహ ముద్దపప్పు సరే సరీ. పెళ్ళి కూతుర్లా పచ్చగా కళకళలాడుతోంది. దానికి జోడిగా ఏంచేశానో తెలుసా? దోసావకాయ. ఎర్రగా, వర్రగా భలే ఊరించేస్తోంది. అప్పడాలు మీకు వడ్డించాక వేడివేడిగా వేస్తా. అప్పడాలూ, ఊరుమిరపకాయలు ఇత్తడి మూకుడులోంచి డైరెక్టుగా అరిటాకులో పడితేనే రుచి. ఆ 'కరకరే ' వేరు. హాయిగా నువ్వూ, అచ్యుతూ, మీ నాన్నగారూ కాళ్ళు కడుక్కురండి. అన్నట్టు అరిటాకులు నువ్వే కొయ్యి. మీ నాన్నకి ఇన్నేళ్ళొచ్చినా ఎలాంటి అరిటాకుల్ని కొయ్యాలో బొత్తిగా తెలీదు. సరేనా" చాలా మృదువుగానూ, స్పష్టంగానూ అన్నది సౌభాగ్యలక్ష్మి. వంటకాల్ని ఆవిడ వల్లించిన విధానం వినగానే వ్యాకులత చెట్టెక్కి, ఆకలి ముంచుకొచ్చింది వాసుదేవ్‌కి. "అమ్మా.. నువు నిజంగా గ్రేట్" తల్లికి సెల్యూట్ చేసి నవ్వాడు వాసుదేవ్. పుండరీకాక్షయ్యగారూ నవ్వారు.

అచ్యుత్, వాసుదేవ్ అరటిచెట్టు వైపు వెళ్తుండగా, "వాసూ, కత్తి లేకపోతే ఆకు ఎలా వస్తుందీ! లాభం లేదురా యీ ఏడాది అయినా నీకు పెళ్ళి చెయ్యాల్సిందే" కత్తి కొడుకు చేతికిస్తూ నవ్వింది సౌభాగ్యలక్ష్మి. చిన్నగా నవ్వాడు వాసుదేవ్.

"భలే వర్ణించావే సౌభాగ్యం. వింటేనే ఆకలి దంచేస్తోంది" కాళ్ళు కడుక్కు వచ్చి అన్నారు పుండరీకాక్షుడు.

చక్కగా పీటలు తనేవేసి గ్లాసులు పెట్టి, గ్లాసుల్లో నీళ్ళు తనే నింపారు పుండరీకాక్షుడుగారు. ఈనాటి వరకూ ఇంటి వారందరూ పీటలమీద కూర్చుని భోంచేయడమేకానీ, డైనింగ్ టేబుల్ ఎవరూ వాడలేదు. వాసుదేవ్ దాన్నే రీడింగ్ & రైటింగ్ టేబులుగా మార్చుకున్నాడు.

ఒద్దికగా చక్కగా ముగ్గురికీ భోజనం వడ్డించింది సౌభాగ్యలక్ష్మి. ఆమె ఏనాడూ భర్తతో కూర్చుని కానీ, భర్తకంటే ముందు కానీ భోజనం చెయ్యలేదు. అందుకే, ఎంత లేటైనా పుండరీకాక్షయ్యగారు కూడా ఇంటికొచ్చే భోంచేసేవారు గానీ, హోటళ్ళలో తినేవారు కాదు.

"అమ్మా అన్ని పదార్థాలూ అద్భుతంగా ఉన్నాయి. బాబుగారి పక్కన నన్నూ కూర్చోబెట్టి వడ్డించడం..." మాట మధ్యలోనే ఆపి కళ్ళు తుడుచుకున్నాడు అచ్యుత్.

"నీ మొహం. అవన్నీ మానేసి బుద్ధిగా తిను. ఎవరెక్కువ తింటారో చూస్తా. వాసూనా, నువ్వా?" పోటీ పెట్టినట్టు అని నవ్వింది సౌభాగ్యలక్ష్మి.

నిజంగా మాటలు అద్భుతం. సౌభాగ్యలక్ష్మి అమ్మగారేకాదు, అత్తగారు కూడా గొప్ప వంటగత్తే. కూర తరిగితే అన్ని ముక్కలూ ఒకే సైజులో తరగాలి, పోపుపెడితే ఆ సువాసన వీధిలోకి పాకి, నడిచే వాళ్ళ ముక్కుల్లో దూరి ఆకలిని పెంచాలి. అందుకేనేమో సౌభాగ్యమ్మగారి మాటలంటే చుట్టాలూ, పక్కాలూ పడి చచ్చిపోతారు. ఏ కూరలు ఏ వూరిలోంచి తెస్తే నాణ్యంగా వుంటాయో, ఏ వస్తువులు ఎక్కడ ఏ కొట్టునించి తేవాలో ఆవిడ స్పష్టంగా చెప్పి మరీ తెప్పిస్తుంది .మెంతిపొడి, కారంపొడిలాంటివన్నీ తనే తయారు చేసుకుంటుంది. ఇంగువా ప్రత్యేకంగా తెప్పించిందే.

"అమ్మా, నిజంగా భోజనం ఎంత బాగుందంటే, భుక్తాయాసంతో కళ్ళు మూతలు పడుతున్నై, "చేతులు కాళ్ళు కడుక్కొచ్చి అన్నాడు వాసుదేవ్. భోజనానికి ముందూ, తరవాతా చేతులూ కాళ్ళూ చక్కగా కడుక్కోవడం ఆవిడే వాసుదేవ్‌కి చిన్నతనం నించీ నేర్పింది.

"హాయిగా ఓ గంట రెస్ట్ తీసుకోరా" అంటూ బెడ్‌రూంలో ఏసి వేసి వచ్చారు పుండరీకాక్షయ్య. వాసుదేవ్ లోపలికి వెళ్ళాడు.

"అమ్మా.. నేను జీప్‌లో కూర్చుంటా. మెసేజ్‌లు వస్తై" అని జీపు దగ్గరికి వెళ్ళాడు అచ్యుత నారాయణ.

స్టిట్సన్ అర్జంటు పనివున్నదని బయటికి వెళ్ళాడు. గోర్కీ, రాజోవ్ స్కీ ఇద్దరూ కూర్చున్నారు. "ఈ బ్రిటిష్ వారికీ అమెరికన్స్‌కీ ఉండే అభిజాత్యం జన్మలో పోదు. దే ఆర్ నెవర్ స్ట్రైయిట్. భూమండలానికే పెద్దన్నగా లాఠీ పుచ్చుకుని, యుద్ధాల్ని సృష్టించి ఆయుధాల్ని అమ్ముకునేవారు ఒకరూ, సమయం కోసం చూసి కిందకి లాగి పడేసేవారు ఒకరూ" నిస్పృహగా అన్నాడు రాజోవ్‌స్కీ.

"ఏమైందీ" అన్నాడు గోర్కీ, "బ్రిటిష్ ఏజంట్లు ఇండియానించి వచ్చిన సీక్రేట్ ఇన్‌ఫర్మేషన్ ఇప్పటివరకూ మనముందు పెట్టలేదు. పరిశోధన ముందుకెళ్ళమంటే ఎట్టా వెడుతుందీ?" చికాగ్గా అన్నాడు రాజోవ్‌స్కీ.

చిన్నగా నవ్వాడు గోర్కీ.

"బ్రదర్, మీ రష్యన్సు సామాన్యంగా మీ చికాకునీ కోపతాపాలనీ బయట పెట్టరు. ముఖకవళికల్లో ఏ మాత్రం తేడా చూపరు. ఇవాళ నీకు వచ్చిందంటే ఏదో పెద్దదే జరగాలే!" అన్నాడు గోర్కీ.

ఓ నిముషం గోర్కీవంక చూసి తానూ నవ్వేశాడు రాజోవ్‌స్కీ. "నిజం బ్రదర్" నువ్వన్నదీ నిజమే. ఆ పశువులన్నీ చచ్చిపోవడానికి గద్దలే కారణంకాదు. ఆ గద్దలు ప్రయోగింపబడ్డవి. ఆ ప్రయోగం వెనుక కొందరు ఫకీర్లు ఉన్నారని మా ఏజంట్సు నాకు స్పష్టంగా చెప్పారు. అసలు వ్యవహారం ఏమంటే, ఆ ఫకీర్లు అందరూ ముస్లిమ్స్ కారు .అనేక మతాల్నించి ఇస్లాం స్వీకరించినవారు" ఓ క్షణం ఆగడు రాజోవ్‌స్కీ.

"ఓహ్... మరి!" అన్నాడు గోర్కీ. ఇతరులమీద కోపం ద్వేషం ఒక్కోసారి నిజాల్ని తమంతట తామే చెప్పేలా చేస్తాయి, అని గోర్కీకి తెలుసు.

"అలాంటి ఫకీర్ల బాచ్‌లు ఇప్పుడు అన్ని దేశాలకీ టూరిస్టుల రూపంలో పంపబడుతున్నాయట. వారిలో కొందరు మహిమల్ని చూపి మనుషుల్ని దాసాను దాసులుగా మార్చుకోగలరుట. కొందరు ఒక పది సెకన్ల కళ్ళలోకి చూసి ఎదటివార్ని వశం చేసుకుని వారితో ఏమైనా చేయించగలరుట. కొందరు రక్తపిపాసులు. వాళ్ళు హింసించడంలో ఎక్స్‌పర్ట్‌లట. అంటే ఆ బేచ్‌లలో వారు మీ ఇండియన్ సూక్తిలా, సామదాన భేద దండోపాయాలు క్షుణ్ణంగా తెలిసినవారట. ఇది నాకొచ్చిన పూర్తి ఇన్‌ఫర్‌మేషన్!

"ఇది స్టిట్సన్‌కీ డాంటేకీ తెలుసా?" అడిగాడు గోర్కీ. వాళ్ళకి ఇంతకంటే ఎక్కువే తెలుసని నాకు తెలుసు. ఆ బాచ్‌లు ఎన్ని, ఒక్కో బేచ్‌లో ఎంతమంది వుంటారు, వాళ్ళ మోడ్ ఆఫ్ ఆపరేషన్ ఎలా వుంటుంది? ఇవన్నీ వాళ్ళిద్దరికీ

సమాచార రూపంలో లభించే వుంటాయని నాకు ప్రగాఢ నమ్మకం. వాళ్ళు పొరబాటున కూడా ఆ విషయంలో నోరెత్తడంలేదు." తనకున్న సమాచారాన్నంతా నిస్సంకోచంగా బయటపెట్టాడు రజోవ్‌స్కీ.

"థాంక్స్ ఫర్ షేరింగ్ రజోవ్‌స్కీ. కొన్ని ప్రయోగాలు, అంటే మంత్ర ప్రయోగాలు జరిగాయన్న విషయం స్పష్టం. వాళ్ళు దేశదేశాలకీ కలుపు మొక్కలుగా విస్తరించడం అన్నది కూడా ఆలోచించావలసిన విషయమే. కేవలం టూరిస్టు వీసాలతో వాళ్ళు ఇతర దేశాల్లో అడుగుపెడితే, వాళ్ళని జల్లెడ పట్టడం సులభమే. కానీ, వారు మరో మార్గాన్ని ఎంచుకుంటే? దేశదేశానికీ వైవిధ్యమైన పద్దతుల్ని ఆచరిస్తే? సరేనయ్యా.. అసలు వాళ్ళ ఉద్దేశ్యం ఓ మహా ప్రళయాన్ని సృష్టించాలనా? సృష్టిస్తే వారికి వచ్చే లాభం ఏమిటీ? ఇవన్నీ ముందు ఆలోచించాలి" అన్నాడు గోర్కీ.

"గోర్కీ, నాకు అర్థంకానిదీ అదే ప్రపంచం అంతా నాశనమైతే మీరూ నాశనం అవుతారుగా. అందర్నీ చంపి వీళ్ళు వీళ్లు నాశనం మాత్రం ఏం బావుకుంటారూ? పోనీ చిన్నో చితకో తుఫాన్లూ సునామీలూ సృష్టించినా వారికి లభించేది ఏమిటీ? అసలు వీరి యుద్ధం ఎవరిమీద? మనుషులమీదా? మతాల మీద? కులాల మీద ? ప్రభుత్వాలూ, ప్రభుత్వాధినేతల మీదా? లేదూ, వారి సంస్థని ప్రపంచం గుర్తించి గడగడలాడాలనా? ఇవన్నీ ఒకవైపు వుంటే, మరోవైపు

ఇంకో రకం ప్రశ్నలు. ఈ వ్యవహారం వెనుక ఉన్నది ఒక దేశమూ లేక దేశాల కూటమా? కేవలం ఒకే దేశం ప్రభుత్వం కళ్ళుగప్పి ఇంత వ్యవహారం నడపడం సాధ్యమా? తనలోని ప్రశ్నలనూ బయట పెట్టాడు రాజోవ్‌స్కీ.

"అదలావుంచు. డాంటే, స్టిట్సన్‌ల ప్రవర్తనకి అర్థం వారికి మనకి తెలీని సమాచారం వారికి తెలియడమా? లేక యీ ప్రళయం సృష్టించే దేశాల్లో వారి దేశమూ ఉన్నదా అని కనుక్కోవాలి. అయినా, రజోవ్‌స్కీ, ఎవరి మార్గంలో వాళ్ళుగా మనం ముందు కెళ్దాం. మనలో అన్నీ పంచుకునే వారితో మనమూ మన సమాచారాన్ని పంచుకుందాం. వారు పంచుకోనప్పుడు మనమూ పంచుకోనక్కరలేదు" అన్నాడు గోర్కీ.

"యస్.. అంతకుమించి చెయ్యడానికి మాత్రం ఏముందీ" మెల్లగా తలని ఆడించాడు రజోవ్‌స్కీ.

"మంత్రాలు అస్త్రాలు మీద ఎవరితో డిస్కస్ చెయ్యాలి?" అడిగాడు రజోవ్‌స్కీ. పకపకా నవ్వాడు గోర్కీ.

"రజోవ్" ఇప్పుడు వాటి అవసరంలేదు. డిజిటల్ సిస్టమ్స్ చాలా ముందుకెళ్ళాయి. ఇంట్లో కూర్చుని హాయిగా చిప్స్ తింటూ యుద్ధాల్ని కళ్ళారా లైవ్‌గా చూసే రోజులివి. క్రికెట్ మేచ్‌లనీ, హాకీ మేచ్‌లనీ లైవ్ ప్రోగ్రామ్స్ నీ చూడటం లేదూ. ఖండాంతర క్షిపణులు లేవూ, నీ చోట నువ్వు కూర్చుని మరో దేశాన్ని ధ్వంసం చెయ్యడానికీ. అంతెందుకూ, అంతరిక్షంలోకి ఉపగ్రహాల్ని పంపడం ఓ యజ్ఞం ఒకప్పుడు – ఇప్పుడు ఎవరికి వారు ప్రయివేట్ శాటిలైట్లనే డబ్బు చెల్లించి కక్షలో కూర్చోబెడుతున్నారు. డోంట్ వర్రీ. ఆ విషయం అఫ్‌కోర్స్ నేనూ దృష్టిలో పెట్టుకుంటా" నవ్వి లేచాడు గోర్కీ.

మహాకన్యాదేవి కళ్ళవెంట బొటబొటా కన్నీరు కారింది. ఆమె మొహంలో చెప్పలేని వేదన. మాయాదేవి కంగారుగా "ఏమైంది తల్లీ" అని అడిగింది.

"అమ్మా.. మాతా జటావల్లభినించి మారీచ యోగాన్ని గ్రహించి తప్పుచేశాననిపిస్తోంది. కళ్ళకి నిధులేకాదు గతకాలపు భీభత్సాలూ కనిపిస్తున్నాయి" సన్నగా వినిపించీ వినిపించనట్టు అన్నది మహా కన్యాదేవి.

"ఏం కనిపిస్తున్నాయీ?" అడిగింది మాయాదేవి.

"ఎదురుగా ఏముందీ?"

"క్షిప్రానది ఉంది"

"ఆ నది మాత్రమేనా ఇంకేమైనా కనపడుతున్నాయా?" అడిగింది మహాకన్యాదేవి.

"నా కళ్ళకి నదీ, అందులో తిరుగాడుతున్న పడవలూ, ఆ పడవల్లో కూర్చుని విహారం చేస్తున్న మనుషులూ తప్ప ఏమీ కనపడటంలా" మరోసారి నదిని పరీక్షగా చూసి అన్నది మాయామయి.

"నాకు వేల కొద్దీ మానవ కపాలాలూ కంకాళాలూనది క్రిందలోలోతుల్లో కనిపిస్తున్నాయి. మహాబలులు జరిగిన బలిపీఠాలు కనపడుతున్నాయి. గుట్టలు గుట్టలుగా వున్నాయి. ఎప్పటివో తెలీదు.  ఎవరివో తెలీదు అమ్మా.. ఆ కంకాళాల చేతులకీ   కాళ్ళకీ నడుముకీ కంఠాలకీ లెక్కలేనన్ని ఆభరణాలు వున్నై. అవి మట్టిలో కప్పబడిపోయినా, నా కళ్ళకు ఇప్పుడే స్వర్ణకారుల దగ్గర్నించి వచ్చాయా అన్నంత మిలమిలలాడుతూ మెరుస్తున్నాయి. ఈ విషయం బయటికి చెబితే ఏమవుతుందో తెలుసా. ఈ నదినే ఇరికించి భూమిలోని కంకాళాలమీద వున్న ఆభరణాల్ని కొల్లగొడతారు. అమ్మా.. ఆ ఆభరణాలమీద మోజుతోనేమో నేను ఏనాడూ చూడని, ఊహించని 'క్షేచరాలు' (అంటే భూం లోపల పొరల్లో మాత్రమే జీవించే జీవులు) ఆ కంకాళాలని కాపలా కాస్తున్నాయి. ఒకటితో ఒకటి అప్పుడప్పుడు శతృత్వంతోనే కొట్టుకుంటున్నాయి." ఓ క్షణం ఆగింది మహా కన్యాదేవి. మాయాదేవి, మిగతా కన్యలేగాక హనుమంతు కూడా చెవులు రిక్కించి వారి మాటలు వింటున్నాడు.

"అమ్మా.. అది భూమికింద తయారైన బురదలా లేదు. రక్తమాంసాలు ఏకమై సృష్టించిన మడుగులా వుంది. ఎంత పెద్దమడుగంటే నది అవతలి వడ్డు తరవాత ఓ రెండువేల ఎకరాలూ, యీవలి ఒడ్డు తరవాత ఓ రెండువేల ఎకరాలూ విస్తరించివుంది. అన్నీ కపాలాలూ, కంకాళాలూ, ఆభరణాలూ, ఉడుకుతూ ఆవిర్లు గక్కుతున్న రక్తమాంసాలు. వాటిమధ్య రక్షక భటుల్లా తిరుగుతున్న మహాక్షేచరాలు. అవి నున్నని ఎలుగ్గొడ్లలా వున్నాయి. ఏనుగంతటి ఎలుకల రూపాల్లో వున్నాయి. కొన్ని జీవులకు కొమ్ముల్లాంటి వెంట్రుకలు. అసలది ఏలోకం? కంకాళాలూ యుద్ధం చేసి టప్పున రాలుతున్నాయి. మరణం తరవాత కూడా కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు ఆ కంకాళాలని ఆవరించే వున్నాయా? అమ్మా పచ్చని ప్రకృతిని ప్రేమించాక లోహాలనీ రాళ్ళనీ ప్రేమించి వాటికోసమే నరుక్కుని చచ్చే జాతా యీ మానవజాతి. దుర్లభమైన మానవజన్మనెత్తి, నేలకి యోజనాల కింది పొరల్లో పడికూడా శతృత్వాన్ని బతికించుకునే జాతా మనుష్యజాతి." వేదనలో విహ్వలతతో మహాకన్యాదేవి గొంతు వొణికింది. సున్నితమైన ఆమె శరీరం దుఃఖంతో ఎగసెగసి పడుతోంది. మాయాదేవి లేచి మహా కన్యాదేవి పక్కన కూర్చుని మెల్లగా దగ్గరకు తీసుకుంది. ఏమనుకుందో ఏమో, మహాకన్యాదేవి ఏడుస్తూనే మాయాదేవి ఒళ్ళోకి జారిపోయి వెక్కివెక్కి ఏడ్చింది. దాదాపు అరగంట తర్వవాత అలానే నిద్రపోయింది మహాకన్యాదేవి. హనుమంతు అవాక్కయ్యాడు. మహా కన్యాదేవి చూసిన దృశ్యాల వర్ణన అతడ్ని విచలితుడ్ని చేసింది. సాయంత్రపు వెలుగులు సన్నబారి  చీకటికి చోటిస్తున్నాయి. గాలి ఓంకారానికి బదులు ఘీంకారం చేస్తూ తెరలు

తెరలుగా వేడిగా వస్తున్నవి.ఆ వేడీ సూర్యతాపమూ, మహాకన్యాదేవి కన్న స్వప్న తాపమా, హనుమంతుడికి అర్థం కాలేదు. కానీ గాలిలో ఓ విషాదం ఓ వృద్ధ నర్తకిలా నడయాడటం గమనించాడు.

మాయాదేవి, మహాకన్యాదేవీ, మిగతా కన్యలూ, హనుమంతూ క్షిప్రానది ఒడ్డున నిలబడి మృత్యుంజయ మంత్రాన్నీ, ఆత్మశుద్ధి మంత్రాన్నీ వెయ్యిసార్లు జపించి 'ఎవరో తెలియని' మృతులందరికీ విశ్వాత్మ సాక్షిగా, సర్వసాక్షి సూర్యుని సాక్షిగా తర్పణాలు విడిచారు. ఆ తరవాత మహామాయ. శాంతి మాత్రం చెబుతూవుంటే, అందరూ ఉచ్ఛస్వరంతో అనుసరించారు.

ఓం సర్వేషాం సిద్ధిర్భావతు ఓం సర్వేషాం సిద్ధిర్భావతు

ఓం సర్వేషాం స్వస్తిభవతు ఓం సరేషాం స్వస్థిర్భవతు

ఓం సర్వేషాం పూర్ణం భవతు ఓం సర్వేషా పూర్ణంభవతు

ఓం సర్వేషాం మంగళం భవతు ఓం సర్వేషాం మంగళం భవతు

ఓం ద్యౌ శాంతి: ఓం ద్యౌ శాంతి:

ఓం అంతరిక్షా శాంతి: ఓం పృధ్వీ శాంతి:

ఓం అప: శాంతి: ఓం ఆప: శాంతిహ:

ఓం ఔషధయ శాంతిః ఓం ఔషధయ శాంతిః

ఓం వనస్పతయ శాంతిః ఓం విశ్వదేవ శాంతి:

ఓం విశ్వదేవ శాంతి: ఓం బ్రహ్మ శాంతి: ఓం బ్రహ్మ శాంతి"

ఓం శాంతి దేవ శాంతి: ఓం శాంతి దేవ శాంతి:

ఓం శాంతి శాంతి శాంతి: ఓం శాంతి శాంతి శాంతి:

"ఈ మంత్రం ఎందుకు చదువుతారు అమ్మా?" హనుమంతు మహామాయని అడిగాడు.

"నాయనా కన్యమ్మకి ఓ భయంకర దృశ్యం కనబడింది. ఆ దృశ్యవర్ణన నువ్వు విన్నావుగా. ఎప్పుడు ఎక్కడ భయంకరమైన స్వప్నాలు చూసినా, విన్నా, కనీసం మనసులో ఆలోచన వచ్చినా, ఆ విషయాలు మనసులోకి దూరి విత్తనాల్లా పడివుంటాయి. భూమిమీద పడ్డ విత్తనం ఎప్పుడో అప్పుడు మొలకెత్తకమానదు.

అలాగే, మనసులోపడ్డ ఆలోచన అనే బీజం కూడా పరిణామక్రమంలో మనసుని ప్రభావితం చెయ్యకమానదు. అందుకే మన పూర్వులు శాంతి మంత్రాలను సృష్టించారు. నాయనా, ఓ గాయకుడు పాడిన పాటో, ఒక మనిషి మాట్లాడిన మాటో గాల్లో కలిసిపోతుందంటారు. అది తప్పు. గాలి లేకపోతే శబ్దం ప్రవహించలేదు. అంటే మన మాటలూ పాటలు అన్నీ గాల్లో కలుస్తాయి. అంతేకాదు, వినేవారి మనసులోనూ నాటుకుంటాయి. అందుకే ఒక పాట మనసులో దూరితే అది మళ్ళీ మళ్ళీ మళ్ళీ స్ఫురణకి వస్తుంది. ఈ శాంతి మంత్రంకూడా, గాలిలో కలిసి గాలిని శాంతపరచడమే కాక మనసునీ శాంత పరుస్తుంది. ఈ మంత్రంలో మనం ఆకాశాన్ని, అంతరిక్షాన్ని, భూమిని, జలాన్ని, ఔషధాలను, వృక్షాలనూ అడవులనూ, విశ్వాన్నీ సృష్టినీ అంతటినీ శాంతపరుస్తూ, శాంతికి కూడా శాంతి కలుగుగాక అని ప్రార్థిస్తున్నాము. ఇది మన స్వార్థం కోసం చేసే ప్రార్థన కాదు. విశ్వశాంతి కోసం పఠించిన మంత్రం" గోప్యమైన రహస్యాన్ని హనుమంతుని వివరించింది మహామాయ. ఒడ్డున వున్న సామాన్య ప్రజలకు కూడా శాంతి మంత్ర మహిమ కొంత అర్థమైనట్టు తలాడించారు.

"ఒకప్పుడు “Hei Hitlor” అని ఒక దేశం ఎలుగెత్తి పాడితే, ‘Long live the King’ అని శతాబ్దాలపాటు ఇంకా కొన్ని దేశాలు ఎలుగెత్తి పాడుతూనే వున్నాయి. కానీ మాతా, మన భారతీయులు మాత్రం 'లోకాస్సమస్తా సుఖినోభవంతు అని అన్ని లోకాల యొక్క సుఖ సంతోషాల్నీ కోరుకున్నారు, ఈనాడు కోరుకుంటున్నారు. ఈ బంగరు భూమిలో పుట్టడానికి మనం ఎన్ని జన్మల పుణ్యం చేశామో!" ఆకాశానికి నమస్కరిస్తూ అన్నాడు ఓ వృద్ధ బ్రాహ్మణుడు హిందీలో.

సరిగ్గా అదే సమయంలో, నివృత్తి యాగం ముగిసింది. పూర్ణాహుతి కూడా ముగిసింది. సంకల్పానంద సారథ్యంలో అలంబస అరిదమన అనీషులేకాక రుత్విక్కులు బ్రహ్మచారులు అందరూ శాంతి మంత్రాన్ని బిగ్గరగా ఏక కంఠంలో పఠించారు. శిథిలాలయంలో అమ్మవారి ఎదుట పెట్టిన సాలగ్రామం (శిలాబంతి) అంతసేపూ రంగు రంగులు కాంతులీనుతూ మెరుపులు మెరిసింది.

మంత్ర స్వరాలనీ శబ్దాలనీ అది తనలో 'ఆవాహన చేసుకుంటోందో' అనిపించింది అందరికీ. భగవంతునికి ధన్యవాదాలు అర్పిస్తూ స్వస్తి పలికారు. తేలిగ్గా అందరూ శాంతంగా మండపం మీద కూర్చున్నారు.

"రేపు సూర్యోదయానికి ముందరే నేను బయలుదేరి యీ శుభవార్తని మా గురుదేవుడైన రామజోగిగారికి అందిస్తాను" అని శృంగి అన్నాడు. "శుభం" అన్నారు సంకల్పానంద.

"కానీ గురుదేవ్, నాకిక్కడనించి కదలాలని అనిపించడంలేదు. ఒకప్పుడు యీ అడవిని అసహ్యించుకున్నాను. ఇప్పుడైతే నాకు మళ్ళీ ఆ జనారణ్యంలోకి పోబుద్ధి కావడంలేదు" తలవంచుకుని అన్నాడు శృంగి.

"కానీ, అందుకు నువ్వు నీ గురువు అనుమతి తీసుకోవాలి నాయనా" అనునయంగా అన్నారు సంకల్పానంద.

"నేనూ పరమేశ్వర శాస్త్రిగారికి యీ తీపివార్త అందించాలి. శృంగితోపాటు నేనూ బయలుదేరుతా" అన్నాడు మట్టూ.

"మీ అందరికీ శుభాశీస్సులు. నాయనలారా, నా శేషజీవితాన్ని ఇక్కడే గడపాలని నిర్ణయించుకున్నాను. సాలగ్రామాన్ని జీవింపచేయాలంటే, సజీవస్థితిలోనే వుంచాలంటే ఎవరో ఒకరు బాధ్యత తీసుకోవాలి. ఆ బాధ్యత నేను తీసుకుంటాను" స్థిరంగా అన్నాడు సంకల్పానంద. అందరూ ఆనందంగా చప్పట్లు చరిచారు.

"అయ్యా మీకు కావల్సిన సమస్త సంభరాలు నేనూ మా సోదర భిల్లులూ సమకూరుస్తామని విన్నవించుకుంటున్నా" వినయంగా అన్నాడు నీలుడు. 'జయహో జయహో' అంటూ జైకారం చేశారు అందరూ. ఓ చల్లని గాలి తరగ అందర్నీ తాకింది.

Post your comments